ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక


విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సోమవారం 11-8-2025 సంపుటి : 1 సంచిక :61 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 8 వెల రు : 2/-

## సాగర్ 2గేట్లు ఓపెన్


నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరడంతో అధికారులు 2గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటిమట్టం 590అడుగులు కాగా 65,827 క్యూసెక్కుల ఇన్, 60, 644క్యూసెక్కులు అవుట్తో కొనసాగుతోంది. ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,50,857క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా 1,00,800క్యూసెక్కులు అవుట్ గా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యూలేటరీ నుంచి 35వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 879.60 అడుగులు ఉంది.





## అడవి తల్లి బాట గురించి గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి

గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' పేరిట చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రెండు వారాలకోసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో పవన్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం జన్ మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు.'అడవి తల్లి బాట' పేరుతో రెండు దశల్లో చేపట్టిన పనుల్లో స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్లు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పవన్‌కు అధికారులు తెలిపారు.





## ఆటలో..అవినీతి..!

### 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణపై విచారణ పూర్తి

- ఒకట్రెండు రోజుల్లో డీజీపీకి నివేదిక
- నాటి వైసీపీలో కీలక వ్యక్తులపై చర్యలకు అవకాశం?
- దీచిక్కుల్లో మాజీ మహిళా మంత్రి!

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహిం చిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహ ణపై విజిలెన్స్ విచారణ పూర్తైంది. ఈ నివేదికను విజిలెన్స్ విభాగం అధికారులు ఒకటి రెండు రోజుల్లో డీజీపీకి అందించ నున్నారు. వైసీపీ హయాంలో రూ.119 కోట్ల నిధులతో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో భారీ ఎత్తున అవినీతి చోటుచేసు కుందని ఆరోపణలు ఉన్నాయి. క్రీడా పరి కరాల కొనుగోలు, ముగింపు ఉత్సవాల పేరిట భారీగా నిధులు దుర్వినియోగం చేశారని విమర్శలు వచ్చాయి. ఈ వ్యవ హారంలో నాటి మంత్రి ఆర్కే రోజా పాత్ర ఉందని టీడీపీ నేతలు ఆరోపించారు.



## మంత్రి పంపిన వీడియోకు.. చంద్రబాబు ఖుషీ ఖుషీ

### రాగులపాడు పంప్ హౌస్ నుంచి నీటిని పంపింగ్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కేశవ్

ఉరవకొండ నియోజకవర్గం లోని వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ (పంప్ హౌస్) నుంచి 10 మోటార్ల ద్వారా నీటిని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలోకి శనివారం పంపింగ్ చేశారు. హంద్రినీవా కాల్వను వెడల్పు చేసి రాగులపాడు పంప్ హౌస్ నుంచి 10మోటార్లతో నీటి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకి మంత్రి పయ్యావుల కేశవ్ కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో పుష్కలంగా నీరు రావడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇందులో భాగంగా 10 మోటార్లతో నీటి పంపింగ్ జరిగే వీడియోని చంద్రబాబుకి పంపారు. ఈ వీడియోను చూసిన ఆయన సీఎం సంతోషం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాకు ఇంత పెద్ద ఎత్తున నీరు తేవడం తనకు సంతోషంగా ఉందని తెలిపారు.

## కాంబోడియాలో చిక్కుకున్న ఏపీ యువత.. వెనక్కి రప్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




## ఇకపై.. షూటింగ్స్ బంద్..!

### ఫిల్మ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా వేతనాలు పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు పాల్గొన్న 24 యూనియన్ల సినీ కార్మికులు



హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద సినీ కార్మికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఆందోళనకు కృష్ణానగర్ నుంచి 24 యూనియన్ల కార్మికులు భారీగా తరలి వచ్చారు. వేతనాలు పెంచాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం నిర్మాతలు, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. మూడు కేటగిరీ లుగా విభజించి, కార్మికుల వేతనాల్ని పెంచాలని నిర్మాతల నిర్ణయం తీసుకు న్నారు. అయితే.. నిర్మాతల నిర్ణయంపై కార్మిక సంఘాలు అసంతృప్తి చెందాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద సినీ కార్మికుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కొందరికి మాత్రమే వేతనాలు పెంచుతామనడం తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఏ షూటింగ్స్ జరగవని, నిర్మాత విశ్వప్ర సాద్ తమకు నోటీసులు ఎందుకు పంపారో కావడం లేదన్నారు. మేము ఛాంబర్లో మాత్రమే మాట్లాడతామని స్పష్టం చేశారు. పీపుల్స్ మీడియా తమకు రూ. 90లక్షల బకాయి ఉందని ఆరోపించారు. మా వేతనాల పెంపును నిర్మాతలు పెద్ద సమస్యగా గుర్తించడం లేదన్నారు.



## నేటితో ప్రచారం సమాప్తం

### ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు

### తుది దశకు జెడ్పీటీసీ బైపోల్ గెలుపునకు తీవ్ర శ్రమ కట్టుదిట్టమైన పోలీస్ భద్రత

కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట బైపోల్ ప్రచారం తుది దశకు చేరింది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు మైకులు మూగబోనున్నాయి. అనంతరం స్థానికేతరులపై ఆంక్షలు విధించనున్నారు. టీడీపీ, వైసీపీ నేతలు హెూరాహెూ రీగా ప్రచారం నిర్వహించారు. ఒంటిమిట్టలో 11, పులివెందులలో 11 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పులివెందులలో అదనపు బలగాలతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు పులివెం దుల, ఒంటిమిట్టలో కలిపి దాదాపు 500 మందిని బైండోవర్ చేశారు. ఈ నెల 12వ తేదీన పోలింగ్ ప్రతిష్టాత్మకంగా ఎన్నికలు ఉప ఎన్నికలను రెండు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవ దంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. టీడీపీ, వైసీపీ నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నాయి. ఓటింగ్ దగ్గరపడుతుండటంతో వైసీపీ డబ్బును మంచి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు టీడీపీ వినూత్నంగా ప్రచారం చేస్తోంది. బాబాయిని చంపిన అబ్బాయి బ్యాచ్ కు ఓటు వేద్దామా అంటూ పులివెందులలో వినూత్న ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించినవ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. పులివెం దుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. పులివెందులలో జరిగిన ఘటనల నేపథ్యంలో పలువురుపై కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు అనుమతి ఇచ్చిన గ్రామాల్లోనే ప్రచారం నిర్వహించాలని మరో గ్రామంలో నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. దాదాపు 600 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 'సత్వర న్యాయం'..

### దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో నిలబెడతా

బాధితులకు సత్వర న్యాయం అందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆధునిక సాంకేతిక పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి, నిత్యం నిర్దేశిస్తూనే ఉంటారని తెలిపారు. ఏడాది కాలంలో డ్రోన్ పోలీసింగ్, మహిళల భద్రత కోసం శక్తి యాప్, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతమైన సీసీటీవీ కవరేజ్ వంటి ఆవిష్కరణలతో అద్భుతమైన ఫలితాలొచ్చాయని చెప్పారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యత ప్రాతిపదికన దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. కేవలం రెండు నుంచి ఆరు నెలల రికార్డు సమయంలోనే దోషులుగా తేల్చి.. న్యాయం వేగంగా అందేలా చూస్తున్నామన్నారు. ప్రజా నమ్మకం, భద్రత, సంక్షేమాన్ని పెంపొందించే ఏకైక లక్ష్యంతో విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ పని చేస్తోందని హెూం మంత్రి అనిత స్పష్టం చేశారు.



# సంపాదకీయం

## పీ 4 పిచ్చిలో చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడప్పుడూ నేల విడిచి



సాము చేయాలని ఉబలాటపడుతుంటారు. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ తలమాసిన సలహాలు ఇవ్వడానికి ఎవరో ఒకరు తయారవుతారు. ఆచరణ సాధ్యం కాని...ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పుడప్పుడూ నేల విడిచి సాము చేయాలని ఉబలాటపడుతుంటారు. ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ తలమాసిన సలహాలు ఇవ్వడానికి ఎవరో ఒకరు తయారవుతారు. ఆచరణ సాధ్యం కాని ఇలాంటి ఆలోచనలంటే చంద్రబాబుకు మా చెడ్డ ఇష్టం. ఈ బలహీనతను గుర్తించిన కొందరు ప్రతి టర్మ్‌లో పక్కన చేరి దిక్కుమాలిన ప్రణాళికలు రూపొందించి ఆయనను అందులోకి లాగుతారు. దీంతో పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్టు ఆయనకు రాజకీయంగా నష్టం జరుగుతుంది. ఏ నాయకుడైనా ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి గానీ, ప్రజలకు దూరమయ్యే సలహాలు, సూచనలు ఎవరు అందించినా పట్టించుకోకూడదు. జగన్‌రెడ్డి పాలనలో అష్టకష్టాలు పడి చివరకు జైలుకు కూడా వెళ్లిన చంద్రబాబు నాయుడు, ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. దీంతో గతంలో చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వనని, 1995%-%1999 మధ్య కాలంలో తాను ఎలా వ్యవహరించానో ఇకపై అలాగే వ్యవహరిస్తానని ఆయన నమ్మబలికారు. 1999%-%2004 మధ్య కీర్తి కండూతికి అలవాటు పడిన ఆయన సంస్కరణల పేరిట ప్రజలకు దూరమయ్యారు. ప్రజా నాయకుడిగా కాకుండా రాష్ట్రానికి సీఈవో అని పిలిపించుకోవడానికే ఇష్టపడ్డారు. దీంతో 2004లో అధికారం కోల్పోయిన ఆయన రాష్ట్ర విభజన తర్వాత 2014లో గానీ తిరిగి అధికారంలోకి రాలేకపోయారు. ఆ సమయంలో రియల్ టైం గవర్నెన్స్ అంటూ రాజకీయాలను విడిచిపెట్టి సమావేశాలు, సమీక్షలతో గడిపేశారు. ప్రత్యర్థుల రాజకీయ ఎత్తుగడలను పట్టించుకోలేదు. ఫలితంగా 2019లో 23 సీట్లకే పరిమితం అయ్యారు. జగన్మోహన్‌రెడ్డి స్వయంకృతాపరాధంతో 2024లో చంద్రబాబు కనీవినీ ఎరుగని మెజారిటీతో అధికారంలో వచ్చారు. ఈ పర్యాయం అయినా ఆయన ప్రాక్టికల్‌గా, రాజకీయ నాయకుడిగా మారి ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తారని అందరూ ఆశించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత అనుభవాలు మరచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఊదరగొట్టారు. దీనిపై విమర్శలు రావడంతో ఈ మధ్యే తన ధోరణిని మార్చుకున్నారు. ఇంతలోనే ఆయన పీ-4 అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఈ దిక్కుమాలిన సలహాను ఆయనకు ఎవరిచ్చారో తెలియదు గానీ 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా పీ-4 విధానాన్ని అమలు చేస్తానని చంద్రబాబు చెబుతున్నారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ తమ లక్ష్యమని ఆయన చెప్పుకొంటున్నారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలో ఉన్న 20 శాతం పేదలను రాష్ట్రంలో ఉన్న పది శాతం ధనవంతులు ఆదుకోవాలని, ఆయా కుటుంబాలను సదరు ధనవంతులు దత్తత తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారు. లబ్ధి పొందే కుటుంబాలను 'బంగారు కుటుంబాలు', దత్తత తీసుకొనే ధనికులను 'మార్గదర్శులు' అని ముద్దుగా పేర్లు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పది లక్షలా 92 వేల బంగారు కుటుంబాలను, లక్షా 67 వేల మంది మార్గదర్శులను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయాల్సిన కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మార్చివేశారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ అన్న లక్ష్యం ఆచరణ సాధ్యమా? అని కనీస ఆలోచన చేయకుండా మార్గదర్శులకు బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు.

### చెంపదెబ్బ.. గోడదెబ్బ!

పేదరికం లేని సమాజం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా? ఉంటుందా? మన దగ్గర ఎలా సాధ్యం అన్న సందేహం ఎందుకు కలగలేదో తెలియదు. ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించే ఇలాంటి సలహాలు ఇచ్చినవారి జ్ఞానం ఏపాటిదో దీన్ని బట్టి అర్థమవుతోంది. 1995లో ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. అప్పట్లో దీనికి మంచి స్పందన వచ్చింది. ఆయా గ్రామాల్లో పుట్టి పెరిగి ఉన్నత స్థానాలకు చేరినవారు ప్రేరణ పొంది తమ స్వగ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)' పథకాన్ని తీసుకురాలేదు. ఆ తర్వాత కార్పొరేట్ కంపెనీలు తమ లాభాల్లో రెండు శాతం మొత్తాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఎంపిక చేసిన కార్యక్రమాలకు విధిగా ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. దీంతో లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలు, సంస్థలు తమ లాభాల్లో రెండు శాతాన్ని సమాజ హితం కోసం ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడు ఈ పథకం అమలులో ఉండగానే వ్యక్తులకు లబ్ధి చేకూర్చే పీ-4 పథకాన్ని చంద్రబాబుకు ఎవరు అంటగట్టారు? నిజానికి సీఎస్ఆర్ నిబంధన లేనప్పుడు కూడా మనసున్న దాతలు ముందుకు వచ్చి పేదలను ఆదుకున్నారు. విద్య వైద్య రంగాలకు తమ వంతు సాయం చేసేవారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చేయాల్సిన సహాయాన్ని నిర్బంధం చేయాలనుకోవడమే తప్పు. ప్రభుత్వం ప్రైవేట ప్రజల భాగస్వామ్యంతో కూడినదే పీ-4. దీంతో ఇది కలగాపులగంగా మారింది. ముందుగా ఈ పథకం వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా జరిగే నష్టం విషయానికి వద్దాం. రాష్ట్రంలో పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య ఎంత? అన్నది ప్రభుత్వం వద్ద సమాచారం లేదు. తెల్ల రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను కట్టే మరికొందరిని మినహాయిస్తే మిగతా అందరూ పేదరికంలో ఉన్నట్టే! వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోంది. ఈ లెక్కన కనీసం కోటి కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయవలసి ఉంటుంది. ప్రస్తుతానికి పదకొండు లక్షల కుటుంబాలను గుర్తించినట్టు ప్రభుత్వం చెబుతోంది. అలా అయితే మిగతా 89 లక్షల కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారంతా ప్రభుత్వానికి దూరం కారా? ఏ పథకాన్నయినా అందరికీ వర్తింపజేసినప్పుడే రాజకీయంగా ఫలితాలు లభిస్తాయి. అరకొరగా అమలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. తాను స్వయంగా 250 బంగారు కుటుంబాలను కుప్పంలో దత్తత తీసుకుంటానని చంద్రబాబు చెప్పారు. అలా అయితే కుప్పం నియోజకవర్గంలో ఉన్న మిగతా పేద కుటుంబాలు కినుక వహించవా? కాగా, బంగారు కుటుంబాల ఎంపిక కూడా శాస్త్రీయంగా జరగడంలేదు. కొన్నిచోట్ల మార్గదర్శిగా గుర్తించిన వారికంటే అధిక ఆస్తులు కలిగి ఉన్న వారిని కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేర్చారు. ఒక మార్గదర్శికి కొన్ని కుటుంబాల వంతున ప్రభుత్వం కేటాయిస్తుంది.

# ఆటలో..అవినీతి..!

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహిం చిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీల నిర్వహ ణపై విజిలెన్స్ విచారణ పూర్తైంది. ఈ నివేదికను విజిలెన్స్ విభాగం అధికారులు ఒకటి రెండు రోజుల్లో డీజీపీకి అందించ నున్నారు. వైసీపీ హయాంలో రూ.119 కోట్ల నిధులతో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో భారీ ఎత్తున అవినీతి చోటుచేసు కుందని ఆరోపణలు ఉన్నాయి. క్రీడా పరి కరాల కొనుగోలు, ముగింపు ఉత్సవాల పేరిట భారీగా నిధులు దుర్వినియోగం చేశారని విమర్శలు వచ్చాయి. ఈ వ్యవ హారంలో నాటి మంత్రి ఆర్కే రోజా పాత్ర ఉందని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశించడంతో విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేపట్టింది. 'ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన అవకతవ కలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన ఆధారాలను విజిలెన్స్ విభాగం సేకరించినట్లు తెలుస్తోంది. ఈ నివేదిక లోని అంశాల ఆధారంగా బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. వైసీపీ పరిపాలన సాగించిన చివరి ఏడాదిలో ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడలను నిర్వహించి.. అందులో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. కూటమి అధికా రంలోకి రాగానే దీనిపై విచారణకు ఆదే శించారు. ప్రభుత్వ కార్యక్రమం పేరుతో స్పోర్ట్స్ కిట్లు, యాప్, టీ - షర్టులు, బ్రోచర్లు, క్రీడల నిర్వహణ, రవాణా, ఫుడ్ అండ్ ప్రైజ్ మనీ, ముగింపు రోజు ఏర్పాట్లు.. ఇలా మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి మంత్రి రోజా, నాటి శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి చెప్పిన వారికి వర్కర్ అర్డర్లు, నచ్చిన వారికి ప్రాజెక్టులు ఇవ్వడం ద్వారా భారీగా వెనుకేసుకున్నారన్న ఆరో పణలు వచ్చాయి. దీనిపై విజిలెన్స్విచా రణ చేపట్టింది. ఆడుదాం ఆంధ్రా లో చేసిన అవినీతిపై పూర్తి స్థాయి దర్యాప్తు జరుగుతుందని.. ఆగస్టు 10 తర్వాత మాజీ మహిళా మంత్రి ఏ క్షణంలోనైనా అరెస్ట్ కావొచ్చన్నారు శాప్ చైర్మన్ రవినా యుడు గతనెలలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె అరెస్ట్ కోసం వారెంట్ కూడా రెడీ అవుతుందని ఆయన ప్రకటిం చారు. ఈ క్రమంలోనే 'ఆడుదాం ఆంధ్రా'లో జరిగిన స్కామ్పై నేడో.. రేపో విజిలెన్స్ విభాగం అధికారులు డీజీపీకి నివేదిక సమర్పించనున్నారు. ఆడుదాం ఆంధ్రాలో జరిగిన అవకతవ కలు, నిధుల దుర్వినియోగం మూలాలను వెలికితీసినట్టు సమాచారం. నివేదికలో అంశాల ఆధారంగా ప్రభుత్వం.. బాధ్యులపై చర్యలు తీసుకో నుంది. ఈ పరిణామాలు చూస్తే మాజీ మంత్రి ఆర్కే రోజా చుట్టూ ఉచ్చు బిగుసు కుంటుందని రాజకీయ వర్గాలు భావిస్తు నాయి. రానున్న రోజుల్లో పలు సంచలన పరిణామాలు చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


# మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి నారాయణ

: రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఓ మహిళను పారిశ్రామికవేత్తగా చేయాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో మైపాడు గేట్ సెంటర్ వద్ద మెప్మా మహిళలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అండగా ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మోడల్‌గా మైపాడు గేట్ సెంటర్ వద్ద 240 షాపులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామన్నారు. తొలి విడతలో 120 షాపులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు కార్పొరేషన్ ద్వారా రెండు లక్షల రూపాయల సబ్సిడీ అందుతుందని, బ్యాంకు ద్వారా రూ.2 లక్షల లోన్ మంజూరు అయిందన్నారు. అయితే.. వీరికి సొంత నిధులతో ఆర్థిక సహాయం కింద రూ.లక్ష అందజేస్తానని మంత్రి నారాయణ తెలిపారు.



# ప్రకృతి ఒడి.. పరవశించే 'మది'..







నిరంతరం వివిధ పనుల్లో ఊపిరిసలపకుండా ఉండే నగర జీవనం నుంచి కాస్తంత ఉపశమనం కోసం యువత ప్రకృతి ఒడిలో సేదదీరుతున్నారు. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరైన ఈ ప్రాంతానికి వారాంతాలలో ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. కొత్త ఉత్సాహంతో తిరిగి వెళ్తున్నారు. సీతాకోక చిలక పార్కు, నగరవనం ప్రాంతాలతో పాటు అడవిలోకి కుటుంబ సమేతంగా వచ్చి ఆస్వాదిస్తున్నారు. రాజధాని నుంచి కృష్ణా నది మీదుగా మూలపాడు వరకు 5.2 కి.మీ మేర ఐకానిక్ కేబుల్ వంతెన రానుంది. అమరావతికి అత్యంత సమీపంలో ఉండడంతో దీనిని అటవీ శాఖ అభివృద్ధి చేస్తోంది. అరుదైన జీవవైవిధ్యం: ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి కొండలపై రిజర్వ్ అటవీ ప్రాంతం ఉంది. ఇది జి.కొండూరు మండలం వరకు విస్తరించింది. దట్టమైన ఈ కొండల్లో దాదాపు 30వేల ఎకరాల్లో ఉన్న ఈ అడవిలో పలు వృక్ష జాతులతో పాటు చిరుతలు, నక్కలు, తోడేళ్లు, వంటి పలు జంతువులు కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో అరుదైన జీవవైవిధ్యం కనిపిస్తుంది.మూలపాడులోని ఈ ప్రాంతంలోకి వెళ్లగానే మనపై ఒక్కసారిగా లెక్కలేనన్ని సీతాకోకచిలుకలు వాలిపోతాయి. ఇక్కడ వేల సంఖ్యలో కనిపించడానికి ప్రధాన కారణం ఇక్కడి వృక్షాలే. ఇవి స్వచ్ఛమైన గాలి ఉన్న చోటే కనిపిస్తాయి. పురుగు మందులు చల్లిన మొక్కలపై వాలవు. ఇవి తిరిగే చోట ఆరోగ్యకరమైన వాతావరణం ఉన్నట్లు భావిస్తారు.పెరుగుతున్న సంఖ్య: శని, ఆదివారాల్లో యువత ద్విచక్ర వాహనాలు, కార్లలో ఇక్కడికి ట్రెక్కింగ్ కోసం భారీగా వస్తున్నారు. ఇక్కడి జీవవైవిధ్యం, ప్రకృతి సమతుల్యతకు ఇబ్బంది లేకుండా 2 కి.మీ మేర పార్కు ఏర్పాటు చేశారు. కూర్చోవడానికి బల్లలు ఉన్నాయి. 2 కి.మీ ప్రాంతంలో పూర్తిగా కాలినడకనే తిరగాల్సి ఉంది. సీతాకోకచిలుక ఆకారంలో పెద్ద బోర్డులు పెట్టారు. వీటిపై వివిధ రకాల కీటకాల విశేషాలు వరించారు. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 8,156 మంది పర్యటకులు సందర్శించారు. ఏప్రిల్‌లో 1,443, మేలో 2,667, జూన్‌లో 3,678, జులైలో 4,517 మంది వచ్చారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 35వేల మంది వరకు వస్తారని

# పదవులకే వన్నెతెచ్చిన మండలి వెంకట కృష్ణారావు





అసలు సిసలైన గాంధేయవాది, ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు వారందరినీ ఒక వేదికపైకి తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి మండలి వెంకటకృష్ణారావు అని, ఆయన విధానాలు ఆచరించడమే ఆయనకు మనమిచ్చే నివాళి అని సుప్రీంకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ చెప్పారు. మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు సందర్భంగా అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం జస్టిస్ ఎన్.వి.రమణకు తెలుగు వైభవ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్.వి.రమణ మాట్లాడుతూ కృష్ణారావు మంత్రిగా పనిచేసి పదవులకే వన్నె తెచ్చారన్నారు. 1977 ఉప్పెన అనంతరం చేపట్టిన పునర్నిర్మాణ కార్యక్రమాలు, తెలుగు భాషకు ఆయన చేసిన సేవలను ప్రశంసించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం కృష్ణారావు చేసిన కృషి ఆదర్శమన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 1977 ఉప్పెన అనంతరం కృష్ణారావు అందించిన సేవలను కొనియాడారు. మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు రాజకీయాల్లో ఆదర్శంగా పనిచేశారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన జిల్లా న్యాయమూర్తుల సదస్సులో జస్టిస్ ఎన్.వి.రమణ తెలుగు భాష అమలుకు చేసిన సూచనలు భాష పట్ల ఆయనకున్న అభిమానం వెల్లడించిందన్నారు. ఆయనకు పురస్కారం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్‌పర్సన్ నెట్టెం రఘురామ్, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ,



మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్పీ గంగాధరరావు, మండలి వెంకటకృష్ణారావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుజాతి మణిదీపం జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, పాటి రత్నాలు పుస్తకాలను ఆవిష్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# చందానగర్ రైల్వే స్టేషన్ పార్కింగ్ లో ప్రైవేట్ స్కూల్ బస్సులు.

గాయత్రి వార్తలు

చందానగర్ మెట్రో రైల్వే స్టేషన్ వద్ద చైతన్య ప్రైవేట్ స్కూల్ బస్సులకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్న రైల్వే స్టేషన్ పార్కింగ్ గుత్తేదారు. ప్రయాణికుల సౌకర్యార్థమై చందానగర్ హుడా కాలనీ లోని రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసిన రైల్వే డిపార్ట్మెంట్ ఇట్టి పార్కింగ్ స్థలాలకు టెండర్లు పిలిచి ఎవరైతే నిత్యము రైలులో ప్రయాణం చేస్తారో వారి వాహనములు నిలుపుకొనుట కొరకు పార్కింగ్ స్థలం ఉన్నది. కానీ ఇక్కడ పార్కింగ్ కాంట్రాక్టు టెండర్ దక్కించుకున్న గుత్తేదారు ప్రైవేటు స్కూలు బస్సులు నెలకు కిరాయికు ఇట్టి స్థలాన్ని ఇచ్చినాడు ఇది ఎంతవరకు సబబు అని నిరంతరం ప్రజల కోసం పరితపించే మిద్దెల మల్లారెడ్డి ప్రశ్నిస్తున్నాడు. ఇట్టి బస్సుల వలన మా హుడా కాలనీ వాసులు చాలా



ఇబ్బంది పడుతున్నారు మరియు ప్రయాణికులు వారి వాహనములను నిలుపుదామంటే అక్కడ స్థలము లేకుండా పోతుంది ఒక్కొక్క బస్సుకు రోజుకు 200 ల చొప్పున నెలకు 6000 రూపాయలు కిరాయి తీసుకుంటూ జేబులు నింపుకుంటున్న గుత్తే దారు ప్రైవేటు స్కూలు చైతన్య స్కూల్ వారి బస్సులకు వారు వారి స్కూల్ వద్ద పార్కింగ్ స్థలం లేనప్పుడు స్కూలు సమీపంలో ఎక్కడైనా స్థలాన్ని తీసుకోవాలి కానీ ఇలా రైల్వే స్టేషన్ కు సంబంధించిన పార్కింగ్లో పెట్టడం ఎంతవరకు సమంజసం ఇట్టి అన్యాయాన్ని పట్టించుకునే నాధుడే లేడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన మిద్దెల మల్లారెడ్డి పత్రికల ద్వారా సంబంధిత అధికారులను అడుగుతున్నాడు ప్రశ్నిస్తున్నాడు కావున వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి ఇట్టి గుత్తే ధారుపైన చర్య తీసుకుని ప్రజలకు న్యాయం చేయగలరని పత్రికల ద్వారా కోరుతున్నాను బస్సుల బారి నుండి మా హుడాకాలనీ ని రక్షించగలరని అధికారులను కోరుతున్నాను లేనియెడల న్యాయపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మిద్దెల మల్లారెడ్డి తెలియపరుస్తున్నారు.

# కులం పేరుతో దూషించి,దాడి చెసిన తూముకుంట నర్సారెడ్డి ని అరెస్టు చేయాలి.

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు
- దళిత సంఘాల అధ్వర్యంలో దళిత నేత కొమ్ము విజయ్ కుమార్ విన్నపం

గాయత్రి వార్తలు

ప్రభుత్వ రేషన్ కార్డు ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్న కాంగ్రెస్ దళిత నేత కొమ్ము విజయ్ పై దాడి చేసి, కులం పేరుతో దూషించిన మాజీ ఎమ్మెల్యే టి. నర్సారెడ్డి ని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య కు దళిత సంఘాల అధ్వర్యంలో బాధితుడు కొమ్ము విజయ్ విన్నవించారు.ఆదివారంనాడు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్



చైర్మన్ బక్కి వెంకటయ్య ను తన నివాసం లో కలిసి వినతిపత్రం సమర్పించారు. తన ఎదుగుదల ఓర్వలేకనే తన పై నర్సారెడ్డి దాడి చేశాడని అయనను అరెస్టు చెసి కఠినంగా శిక్షించి తనకు న్యాయం వేయాలని కోరారు. ఇందుకు స్పందించి న చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా పోలీస్ కమిషనర్,గజ్వేల్ ఎసిపిలకు ఫోన్ చేసి విజయ్ పై దాడి పై ఆరా తీశారు. నర్సారెడ్డి పై నమోదైన అట్రాసిటి కేసు విచారణను వేగవంతం చేసి చర్యలు తీసుకొవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, దళిత రత్న అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత పొన్నాల కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ముం డ్రాతీ కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జగదే వపూర్ మండల కమిటీ అధ్యక్షుడు పోసాన్ పల్లి రాజు,డిబిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజివ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ వాళ్లు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

గాయత్రి వార్తలు

మండల పరిధిలోని గుట్టగూడెం గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కుంజ కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ కె ఉమర్ మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని నాగుపల్లి పంచాయతీ పరిధిలో వందలాది ఎకరాలు సర్వే నెంబరు 454 సర్వే నెంబర్లు ఆదివాసి పేదలు దళితులు ఇతర పేదలు 2000 సంవత్సరం నుంచి సాగులో ఉన్న భూమిలోనికి వెళ్లిన వారిని ఫారెస్ట్ వాళు అక్రమంగా పీడి యాక్టర్ నాన్ బెల్ బుల్ కేసు పామర్తి లక్ష్మయ్య మీద,ఆదివాసీ గిరిజనుల మీద అక్రమంగా



కేసులు పెట్టి నిర్బంధించి రోజుల తరబడి దమ్మపేట రేంజ్ ఆఫీసులో నిర్బంధించి అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడాన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని పామర్తి లక్ష్మయ్య ఇతర గిరిజన ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఫారెస్ట్ వారిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అక్రమంగా భూదాన భూమిని ఫారెస్ట్ వాళ్లు ఆక్రమించుకొని ప్రజలపై దాడులు చేయటం సరికాదని ఆ భూమిని పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు మారుతి రాఘవులు,వంకా సురేష్, మడివి గోపాలకృష్ణ,కొర్రి నరేష్,కొర్రి వీరస్వామి,ఊకే రమేష్,పోలేం రాజకుమార్, రవ్వ నరేష్,రాములమ్మ, రాఘవమ్మ,కొర్రి వెంకటమ్మ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ దమ్మాయిగూడ...

- చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు..
- దమ్మాయిగూడ మున్సిపల్ చీర్యాల నుంచి కీసరకు వెళ్లే మెయిన్ రోడ్డు లో అక్రమ షెడ్ నిర్మాణం..

గాయత్రి వార్తలు

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి చీర్యాల నుంచి కీసర వెళ్లే మెయిన్ రోడ్ లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా అక్రమ షెడ్ నిర్మాణం. అక్రమార్కులు ధర్జాగా అక్రమ నిర్మాణాలు చేస్తుంటే సంబంధిత అధికారులు ఎంచేస్తున్నారనేది అంతుచిక్కడం ప్రశ్న? మున్సిపల్ నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సమకూర్చే విభాగంలోని టౌన్ ప్లానింగ్ ప్రథమ పాత్ర పోషిస్తుంటే... అక్రమ



నిర్మాణాలతో ఖజానాకు గండిపడుతుంటే కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారనేది అంతుచిక్కని ప్రశ్నలు? ఈ క్రమంలో చూస్తే అక్రమాలకు అడ్డాగా మారిన దమ్మాయిగూడ మున్సిపల్. ఇక వివరాల్లోకి చీర్యాల నుంచి కీసర వెళ్లే మెయిన్ రోడ్ అక్రమ షెడ్ నిర్మాణాలు జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గతంలో అక్రమనిర్మాణాల పై ఎన్నోసార్లు కథనాల రూపంలో వార్తాలు ప్రచురించిన సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవరించడం ఎంతవరకు సమంజసం? ఈ అక్రమ నిర్మాణం పై సంబంధిత




టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఆగస్టు 13 న హుస్నాబాద్ లో జరిగే వికలాంగుల సదస్సు ను జయప్రదం చేయండి

- ముఖ్యఅతిథిగా గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరు

గాయత్రి వార్తలు

రేవంత్ రెడ్డి పెన్షన్లను పెంచి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి అని అన్నారు. మంద కుమార్ మాదిగ ఎంఎస్పీ జాతీయ నేత సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ విహెచ్పిఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు 6000 వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు చేయూత పెన్షన్ దార్ల కు 4000 పెంచాలని మరియు కండర క్షీణత వ్యాధిగ్రస్తులకు 15000 పెంచాలని ఆగస్టు 13 న హుస్నాబాద్ కేంద్రంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్లో వికలాంగుల మరియు చేయూత పెన్షన్ దారుల వికలాంగుల మహా గర్జన సన్నాహక సదస్సు నువ్వు విజయవంతం చేయాలని



కస్తూర్బా కాలనీ లో బోనగిరి రవి ఆధ్వర్యంలో వికలాంగులు చేయుత పెన్షన్ దారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పి జిల్లా కో ఇన్చార్జ్ మల్లిగారి యాదగిరి మాదిగ ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ ప్రకాష్ మాదిగ ఎం ఎం ఎస్ రాష్ట్ర నాయకురాలు జేపీ లతా మాదిగ, ఎంఎస్పి నియోజకవర్గ ఇన్చార్జి ఎనగందుల లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కో ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి మాదిగ వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు అందరు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం

- మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంతరెడ్డి



గాయత్రి వార్తలు

నాగారం మున్సిపాలిటీ పరిధి ఇందిరా ప్రియదర్శిని వీకర్ సెక్షన్ కాలనీ లోని శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ని నాగారం నాయకులు కలసి ఆహ్వానించడం జరిగింది. దానికి సానుకూలంగా స్పందించి తేది: 14- 8- 2025 గురువారం రోజున తప్పకుండా శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనకు హాజరవుతానాని తెలిపారు. దానికి ఇందిరా ప్రియదర్శిని కాలనీకి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేసిన
ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇందిరా ప్రియదర్శిని కాలనీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ కాలనీలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- మాజీ చైర్మన్ చంద్రారెడ్డి




గాయత్రి వార్తలు

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ కమిటీ హాల్ లో ఆదివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ సాయం సేవా సంఘం ఆధ్వర్యంలో రక్షాబంధన్ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ ఉత్సవంగా వేడుకలను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వక్త. ఎం సూర్య నారాయణ మూర్తి, నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి,అక్క కిషోర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, సురేందర్ రెడ్డి, కృష్ణ చారి,బిజెపి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భార్గవి పిళ్ళై పాటల హోరుతో మార్మోగిన అపర్ణా నియో మాల్

గాయత్రి వార్తలు

హైదరాబాదు లోని నల్లగడ్ల అపర్ణా నియో మాల్‌లో జరుగుతున్న నియోస్ షాపింగ్ ఫెస్టివల్లో తొలిసారిగా ఒక సెలబ్రిటీ కార్యక్రమం జరిగింది. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్ళై తన పాటలతో ప్రేక్షకులను




ఉర్రూతలూగించారు. ఆమె లైవ్ పర్ఫార్మెన్స్ చూడటానికి వచ్చిన వందలాది మంది అభిమానులతో మాల్ మొత్తం సందడిగా మారిపోయింది. పాటలు, డ్యాన్సలతో షాపింగ్ ఫెస్టివల్ మరింత కళను సంతరించుకుంది.ఆగస్టు 17 వరకు జరిగే ఈ ఫెస్టివల్‌లో షాపింగ్ చేసేవారికి బంపర్ ఆఫర్లు, లక్కీ డ్రాలు ఉన్నాయి. ?1,000 అంతకంటే ఎక్కువ షాపింగ్ చేసినవాళ్లు లక్కీ డ్రాలో పాల్గొనవచ్చు. ఇక ముందు కూడా ఈ షాపింగ్ ఫెస్టివల్‌లో ఎన్నో ఆసక్తికరమైన కార్యక్రమాలు జరగనున్నాయి. ఆగస్టు 14-15 తేదీల్లో జానపద నృత్యాల ఫెస్టివల్ (ఫోక్ డాన్స్ ఫస్ట్), ఆగస్టు 16న అద్భుతమైన శాండ్ ఆర్ట్ ప్రదర్శన (సండ్ ఆర్ట్ పెర్ఫార్మన్స్) వంటివి ఈ ఈవెంట్లలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈసారి సిటీలో జరుగుతున్న అత్యంత డైనమిక్ షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్‌గా ఇది నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# తాండ్ర వినోద్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసిన తాటి

గాయత్రి వార్తలు

హైదరాబాద్, లో తాండ్ర వినోద్ రావు,ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల 14వ తేదీన జరగనున్న మిత్రుడు వెలిశెట్టి శ్రీనివాసరావు, కుమారుడు "డా" భరత్, వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన



బూర్గంపహాడ్,అశ్వారావుపేట, మాజీ ఎమ్మెల్యే తెలంగాణ తొలి ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, తనయుడు తాటి రవికుమార్



# ముగ్గురు మెగా హీరోలు ఒకే చోట.. ఫొటో వైరల్

రామ్‌చరణ్ , వరుణ్‌తేజ్ , సాయి దుర్గా తేజ్ .. ఈ ముగ్గురు కలిసి దిగిన ఫొటో ప్రస్తుతం 'ఎక్స్'లో వైరల్ అవుతోంది. జిమ్‌లో వ్యాయామం అనంతరం దిగిన ఈ ఫొటోను వరుణ్ తేజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ముగ్గురు హీరోల అభిమానులు దీనిని రీ పోస్టు చేస్తూ.. వారి కొత్త సినిమా టైటిళ్ల హ్యాష్‌ట్యాగ్‌లను యాడ్ చేస్తున్నారు. దీంతో Peddi మరోసారి ట్రెండింగ్‌లోకి నిలిచింది. 'పెద్ది' సినిమాలో సమంత స్పెషల్ సాంగ్‌లో కనిపించే అవకాశాలున్నాయంటూ చర్చ జరగడంతో ఆ హ్యాష్‌ట్యాగ్ శనివారం కూడా ట్రెండింగ్‌లోనే ఉంది.రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ స్పోర్ట్స్ పీరియాడికల్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరోవైపు మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ నటిస్తున్నారు. ఈ ఇండో- కొరియన్ హారర్ కామెడీ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' టైటిల్‌ను పెట్టే అవకాశాలున్నాయని సమాచారం. సాయిదుర్గా తేజ్ నటిస్తున్న మూవీ 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు.

# జోడీ కుదిరిందా?




పూజా హెగ్డే


నితిన్

పూజా హెగ్డే ప్రస్తుతం తమిళంలో వరుస సినిమాలతో జోరు చూపిస్తున్నప్పటికీ తెలుగు నుంచి ఇంకా కొత్త కబురేదీ వినిపించలేదు. దుల్కర్ సల్మాన్ - రవి నేలకుదిటి కలయికలో రూపొందుతున్న చిత్రంలో నాయికగా కనిపించనున్నట్లు తెలుస్తున్నా.. అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఇప్పుడు పూజ పేరు మరో తెలుగు సినిమా విషయంలోనూ బలంగా వినిపిస్తోంది. నితిన్ కథానాయకుడిగా విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై ఆమెతో సంప్రదింపులు మొదలైనట్లు తెలిసింది. క్రీడా నేపథ్య కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాలో నితిన్ హార్స్ రైడర్‌గా కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనికోసం గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రానికి 'స్వారీ' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఏడాది చివర్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.

# శివ.. సరికొత్త హంగులతో!



భారతీయ సినీ రంగాన్ని మలుపు తిప్పిన చిత్రం...'శివ'. ఆ సినిమా స్ఫూర్తితోనే చిత్ర పరిశ్రమలోకి వచ్చామని చెప్పే నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతోమంది కనిపిస్తుంటారు. ముప్పయ్యేళ్ల కిందట విడుదలై సంచలనాల్ని సృష్టించిన ఈ సినిమా సరికొత్త హంగులతో రీరిలీజ్‌కి సిద్ధమైంది. 4కే విజువల్స్‌తో, డాల్బీ అట్మాస్‌తో ఈ చిత్రం సరికొత్తగా ముస్తాబై త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా రీరిలీజ్ టీజర్‌ని ఆగస్టు 14న 'కూలీ'తోపాటు విడుదల చేస్తున్నారు. నాగార్జున కథానాయకుడిగా... రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించింది.'శివ' రీరిలీజ్ గురించి కథానాయకుడు నాగార్జున మాట్లాడుతూ "నన్నొక ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా ఇది. నా పాత్రని ఎప్పటికీ మరిచిపోలేని స్థాయిలో ఆవిష్కరించింది. ఇన్నేళ్ల తర్వాత కూడా ఈ సినిమా గురించి మాట్లాడుకోవడం చూసి చిత్ర నిర్మాత అయిన మా అన్నయ్య వెంకట్ అక్కినేని, నేను కలిసి దీన్ని ఘనంగా రీరిలీజ్ చేయాలని నిర్ణయించాం. యూ ట్యూబ్‌లో చూసిన కొత్త తరానికీ థియేటర్ అనుభవాన్ని అందించాలని భావించాం. అందుకే రామ్‌గోపాల్ వర్మతో కలిసి మేం డాల్బీ అట్మాస్ సౌండ్‌తో, 4కే విజువల్స్‌తో సినిమాని సరికొత్తగా సిద్ధం చేయించాం" అన్నారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "అన్నపూర్ణ స్టూడియోస్ ఈ సినిమాని రీరిలీజ్ చేయాలని నిర్ణయించడం నాకు థ్రిల్‌ని ఇచ్చింది. కథానాయకుడు నాగార్జునతోపాటు, నిర్మాతలు నాపై పెట్టిన నమ్మకమే ఈ సినిమా. ఈరోజుకీ చాలామంది ప్రతి పాత్రనీ, ప్రతి సన్నివేశాన్ని గుర్తు పెట్టుకోవడం నాకు అద్భుతంగా అనిపిస్తోంద"న్నారు.




# 'ఉదయ్‌పూర్ ఫైల్స్' నిర్మాతకు బెదిరింపులు!

'ఉదయ్‌పూర్ ఫైల్స్' విడుదల నేపథ్యంలో తనను హత్య చేస్తానంటూ ఓ వ్యక్తి నుంచి బెదిరింపులు వచ్చాయని నిర్మాత అమిత్ జానీ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తనకు బెదిరింపు కాల్ వచ్చిన నంబరును షేర్ చేస్తూ.. ప్రధానమంత్రి కార్యాలయం, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ పోలీసు శాఖల సోషల్ మీడియా ఖాతాలను ట్యాగ్ చేశారు. అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వివాదాస్పద సినిమా విడుదలకు ముందు అమిత్ జానీకి కేంద్ర హోంశాఖ వై కేటగిరీ భద్రత కల్పించింది. 2022లో ఉదయ్‌పూర్‌లో జరిగిన దర్జీ కన్హయ్యలాల్ హత్య, తదనంతర పరిణామాల నేపథ్యంతో రూపొందిన సినిమా 'ఉదయ్‌పూర్ ఫైల్స్'. ట్రైలర్ విడుదలైన నాటి నుంచే ఈ చిత్రంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలంటూ పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ సినిమా విడుదలైతే మత సామరస్యం దెబ్బతినే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో, సినిమా విడుదల వాయిదా పడింది. సెన్సార్ పూర్తయిన సినిమా విడుదల వాయిదాను ఆపడంపై దర్శక, నిర్మాతలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఎట్టకేలకు ఈ నెల 8న విడుదలైంది. కన్హయ్య పాత్రలో విజయ్ రాజ్ నటించారు. రజనీష్ దుగ్గల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# స్ఫూర్తిదాయక 'పరదా'



"పరదా' చిత్రం చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. దీంట్లో అనుపమ నట విశ్వరూపం చూస్తారు" అన్నారు హీరో రామ్ పోతినేని. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కించిన చిత్రమే 'పరదా'. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మించారు. దర్శన రాజేంద్రన్, సంగీత ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో రామ్ పోతినేని శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ కథ నాకు తెలుసు. ఇలాంటి వైవిధ్యభరితమైన కథలతో మరిన్ని నాయికా ప్రాధాన్య చిత్రాలు రావాలి. తప్పకుండా ఇలాంటి సినిమాల్ని అందరూ ప్రోత్సహించాలి" అన్నారు. "బలమైన కథ ఉన్న కమర్షియల్ చిత్రమిది. దీంట్లో అనుపమను ఓ కొత్త కోణంలో చూస్తారు. రివ్యూలు చూసి బాగుందని చెప్తేనే మా సినిమాకి వెళ్లండి" అన్నారు దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల. నటి అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ.. "ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నా. తప్పకుండా ప్రతిఒక్కరూ థియేటర్లలోనే సినిమా చూస్తారని నమ్ముతున్నా" అంది. "ఈ సినిమాతో అనుపమ 2.ఓ ని చూడనున్నారు" అన్నారు నిర్మాత విజయ్ డొంకాడ. ఈ కార్యక్రమంలో శ్రీధర్, ధర్మేంద్ర, పూజిత, కృష్ణ ప్రత్యూష, సృజన తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రరూపం దాల్చిన సినీ కార్మికుల సమ్మె.. నిర్మాతల వైఖరిపై 7వ రోజు భారీ ఆందోళనలు..

సినీ కార్మికుల సమ్మె తీవ్రరూపం దాల్చుతోంది. నిర్మాతల వైఖరిపై ఆదివారం (ఆగస్టు 10) వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడుతున్నారు. నిర్మాతలు సూచించిన పర్సెంటేజీ విధానాన్ని అంగీకరించని ఫెడరేషన్.. భారీ ఆందోళనలకు దిగింది. దీంతో 7వ రోజు కూడా ఎక్కడి షూటింగ్ లు అక్కడే ఆగిపోయాయి.టాలీవుడ్‌లో వారం రోజులుగా సమ్మె జరుగుతోంది. ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ శనివారం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో కృష్ణానగర్‌లో ఆదివారం సినీ కార్మికులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ నిరసనలో 24 క్రాఫ్ట్ విభాగాల సభ్యులు పాల్గొననున్నారు.ఫెడరేషన్ సభ్యులతో చర్చలు జరిపిన




అనంతరం నిర్మాతలు సూచించిన పర్సెంటేజీ విధానాన్ని ఫెడరేషన్ అంగీకరించలేదు. నిర్మాతలు యూనియన్లను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఫెడరేషన్ ఆరోపిస్తోంది. టీజీ విశ్వప్రసాద్ తీరుపై నిరసన చేపడుతున్నారు. ఇవాళ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు.తొలి ఏడాది 15, రెండో ఏడాది 5, మూడో ఏడాది 5 శాతం పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. రోజుకు వెయ్యి రూపాయల వేతనం ఉన్నవారికి తొలి ఏడాది 20 శాతం పెంచాలని నిర్మాతలు నిర్ణయించారు. మూడో ఏడాది 5 శాతం పెంచేందుకు నిర్మాతలు సుముఖత వ్యక్తం చేశారు. 2 వేల రూపాయలకు పైగా ఉన్న కార్మికులకు వేతనాలు పెంచలేమని నిర్మాతలు తేల్చి చెప్పారు. చిన్న సినిమాలకు పాత విధానంలో వేతనాలు చెల్లిస్తామని తెలిపారు. వేతనాల పెంపు విషయంలో నిర్మాతలు తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులు వ్యతిరేకించారు. నిర్మాతల నిర్ణయాన్ని అంగీకరించమని, ఫెడరేషన్ ను విభజించేలా వేతనాల నిర్ణయం ఉందని ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆరోపించారు. రోజువారీ వేతనాలు తీసుకునే 13 సంఘాలకు ఒకే విధంగా వేతనాలు పెంచాలని ఫెడరేషన్ డిమాండ్ చేసింది. నిర్మాతలు విధించిన 4 షరతులకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునేది లేదని ఫిల్మ్ ఫెడరేషన్ కుండబద్ధలు కొట్టింది.యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా నిర్మాతల నిర్ణయాలు ఉన్నాయని, రేపటి (ఆదివారం) నుంచి తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఫిల్మ్ ఫెడరేషన్ నాయకత్వం స్పష్టం చేసింది. ఇలా.. నిర్మాతలకు, ఫిల్మ్ ఫెడరేషన్?కు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో టాలీవుడ్ షూటింగ్స్ బంద్ ఎప్పటివరకూ కొనసాగుతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.



# 'కిష్కింధపురి' విడుదల ఖరారు

'కిష్కింధపురి'తో ప్రేక్షకుల్ని భయపెడుతూ థ్రిల్ చేసేందుకు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించారు. సాహు గారపాటి నిర్మించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈ సినిమాని సెప్టెంబరు 12న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం శనివారం ప్రకటించింది. "బలమైన భావోద్వేగాలతో నిండిన హారర్ - మిస్టరీ కథతో రూపొందిన చిత్రమిది. యాక్షన్‌కు ప్రాధాన్యముంది. విజువల్‌గా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందిస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: చిన్మయ్ సలాస్కర్.

# యువతరం మెచ్చే 'జిగ్రీస్'

కృష్ణ బురుగుల, ధీరజ్ అథేర్య, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవల విడుదల చేశారు. "ఇది స్నేహం ప్రధానంగా సాగే రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. యువతరానికి బాగా కనెక్ట్ అవుతుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: కమ్రాన్, ఛాయాగ్రహణం: ఈశ్వరాదిత్య.



సందీప్ రెడ్డి వంగా